క్లుప్తంగా

ఆంజనేయస్వామికి పౌర్ణమి పూజలు



దర్శించుకుంటున్న భక్తులు



రణమండల ఆంజనేయస్వామి

ఆదోని అర్బన్: ఏరువాక పౌర్ణమి సందర్భంగా శనివారం పట్టణ శివారులోని రణమండల ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు టి.జి.పాండురంగయ్యశెట్టి ఆధ్వర్యంలో కార్తీకమాస నిత్య ప్రసాదసేవా సమితి సభ్యులు స్వామివారికి ఫల పంచామృతాభిషేకం, సింధూరసేవ, వడలహారం, ఆకుపూజ, నైవేద్యం, మహామంగళ హారతితో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

మున్సిపల్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

ఆదోని సెంట్రల్: మున్సిపల్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ పురపాలక ఉపాధ్యాయుల సమాఖ్య(ఏపీఎంటీఎఫ్) పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి జంగం బసవరాజు, ఆర్థిక కార్యదర్శి కోటన్న కోరారు. శనివారం స్థానిక పురపాలక ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రాథమిక పాఠశాలల్లోని మిగులు ఉపాధ్యాయుల గుర్తింపును నిబంధనల ప్రకారమే చేపట్టాలన్నారు. పురపాలక పాఠశాలల్లో సబ్జెక్టు పోస్టులను భర్తీ చేయాలన్నారు. సమావేశంలో ఏపీఎంటీఎఫ్ నాయకులు సురేష్ కుమార్, నూరుల్హక్, ప్రతాప్ రెడ్డి, ఆనంద్, రమేశ్ రావు, జ్ఞానమద్దయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో అనర్థాలు



మాట్లాడుతున్న సెబ్ సీఐ భాస్కర్‌రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సెబ్ సీఐ భార్గవ రెడ్డి సూచించారు. శనివారం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు బానిసలైతే అనారోగ్యంతోపాటు శారీరకంగా, మానసికంగా కృషించిపోవడమే గాకుండా చట్టపరంగా నేరస్తులవుతారని హెచ్చరించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండి భవిష్యత్‌పై దృష్టి సారించాలని సూచించారు.

మెరుగైన సేవలందిస్తేనే ఉద్యోగులకు గుర్తింపు



డ్రైవర్లకు ప్రశంసా పత్రాలు అందిస్తున్న డిపో మేనేజర్ అమర్నాథ్

ఎమ్మిగనూరుటౌన్: ఆర్టీసీ ఉద్యోగులు మెరుగైన సేవలందిస్తేనే తగిన గుర్తింపు ఉంటుందని ఆర్టీసీ డిపో మేనేజర్ అమర్నాథ్ అన్నారు. మెరుగైన కేఎంపీఎల్ సాధించిన బస్సు డ్రైవర్లు ఎస్ఎస్ ఈరన్న, హెచ్.సుభాస్‌చంద్రమోహన్ బాబులకు శనివారం డిపోలో నగదు బహుమతి, ప్రశంసా పత్రాలను అందించి సత్కరించారు. డిపో మెకానిక్‌లు కెకె.ప్రసాద్, శరభన్న, శ్రీనివాసులుతోపాటు వెల్డర్లకు ప్రశంసాపత్రాలను అందించారు. కార్యక్రమంలో డిపో సూపరింటిండెంట్ పంపాపతి, అసిస్టెంట్ మేనేజర్ జీవి.నాగరాజు, నేషనల్ మజ్దూర్ అసోసియేషన్ డిపో కార్యదర్శి ముస్తక్ అహమ్మద్ పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



బ్లీచింగ్ పౌడర్‌ను చల్లిస్తున్న అధికారులు

గోనెగండ్ల: వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి సాయిబాబా తెలిపారు. స్థానిక ఒకటవ సచివాలయం పరిధిలో మెదడు వ్యాపు వ్యాధి కేసు నమోదైన సందర్భంగా శనివారం వైద్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది ఆ ప్రాంతానికి వెళ్లి నీరు నిల్వ ఉన్న చోట మోటార్ ద్వారా బయటకు పంపించి, మురుగు కాలువలలో పూడికను తీయించారు. బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. అనంతరం వైద్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది ర్యాలీ నిర్వహించి మలేరియా వ్యాధి సోకకుండా జాగ్రత్తలు పాటించాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ ఈఓ సతీష్, ఎంపీహెచ్ఈఓ హనుమంతు, సుధాకర్ పాల్గొన్నారు.

యాజమాన్య హక్కుల మార్పులు మరవొద్దు

- పాత వాహనాలు విక్రయిస్తే.. కొన్నవారి పేరుతో రిజిస్ట్రేషన్ చేయించండి
- లేదంటే ఇబ్బందులు తప్పవు



సరైన రికార్డులు లేక స్వాధీనం చేసుకున్న వాహనాలు (ఫైల్)

ఆదోని అర్బన్: కొత్త వాహనాల కొనుగోళ్లు పెరుగుతున్నాయి. అదేస్థాయిలో పాత వాహనాల విక్రయాలు కూడా జరుగుతున్నాయి. అయితే పాత వాహనాలను విక్రయించిన వారు కొనుగోలు చేసిన వారిపేరుతో రిజిస్ట్రేషన్ చేయించడం తప్పని సరి. తెలిసిన వాళ్లనో, మరేకారణంతోనే రిజిస్ట్రేషన్ చేయించడం నిర్లక్ష్యం చేస్తే ఆ తర్వాత ఇబ్బందులు పడాల్సి వస్తుందని పోలీసు అధికారులు హెచ్చరిస్తున్నారు. ఆదోని నియోజకవర్గంలో 2.65 లక్షల జనాభా ఉంది. ప్రతి ఇంట్లో కనీసం రెండు వాహనాలు వాడుతూ ఉంటారు. ఈ లెక్కన ఎంత లేదన్నా సరాసరి 50 వేల వాహనాలు ఉండొచ్చని ఆర్టీఏ అధికారుల అంచనా.

పేరు మార్చుకోకపోతే ఇబ్బందులు

పట్టణాలతో పాటు ఇటీవల మండలాల స్థాయిలో పాత వాహనాల క్రయవిక్రయాలు జోరుగా సాగుతున్నాయి. వాహనం అమ్మిన వెంటనే వాహనదారుడు కొనుగోలుదారుడి పేరుపై రిజిస్ట్రేషన్ చేయించాలి. లేకపోతే పోలీసుల చేత ఇబ్బందులు పడాల్సి వస్తుంది. కొనుగోలుదారుడు ఎక్కడైనా వాహనాన్ని యాక్సిడెంట్ చేసినా, అక్రమ మద్యం తరలిస్తున్నా, మైనర్‌కి వాహనం ఇచ్చి నడిపించినా, ఆ సమయంలో ప్రమాదం జరిగినా, రాంగ్ డ్రైవింగ్ చేసినా, నోపార్కింగ్ ప్లేస్‌లో పార్కింగ్ చేసినా విక్రయనదారుడిపై కేసులు నమోదు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఇక వాహనం పాత యజమాని వద్ద ఉన్నప్పుడు చేసిన నేరాల అంశాలకు కొత్త యజమానికి తిప్పలు తప్పవు. కోర్టుల చుట్టూ తిరిగి అనవసరమైన సమయాన్ని వృథా చేసుకోవాల్సి వస్తుంది. రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు ఆలస్యమైతే కనీసం సేల్‌డీడ్ అయినా రాయించుకోవాలి.

జోరుగా మారుబేరాలు

పట్టణాలతో పాటు ఇటీవల మండలాల స్థాయిలో పాత వాహనాల క్రయవిక్రయాలు జోరుగా సాగుతున్నాయి. మధ్యవర్తుల ఆధ్వర్యంలో ఇష్టం వచ్చినట్లు క్రయవిక్రయాలు సాగిస్తున్నారు. వాహనం కొనుగోలుదారుడు వాహనంపై పెండింగ్ కేసులు, చలానాలు ఉన్నాయో లేదో చూసుకోకుండా కొనుగోలు చేయడం వల్ల తర్వాత ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఒక్కోసారి పాత కేసులు గానీ, చలానా గానీ తానే భరించాల్సి వస్తుంది.

29, 30 ఫారాలే ముఖ్యం

వాహనాలు కొన్న వెంటనే ఆర్‌సీ, బీమా, కాలుష్యం, చిరునామా తదితర ధ్రువీకరణ పత్రాలపై సంతకాలు చేసుకోవడం ముఖ్యమని సంబంధిత అధికారులు సూచిస్తున్నారు. వాటితో పాటు ఫారం–29 రెండు కాపీలు, ఫారం–30పై విక్రయించిన వారి సంతకాలు తీసుకుంటే యాజమాన్య హక్కుల బదిలీ సులభమవుతుంది. పాత వాహనాలు అమ్మేశాక యాజమాన్య హక్కులు బదిలీ చేసుకోకపోతే కష్టాలు తప్పవు. కొత్తగా మరో వాహనం కొన్నప్పుడు అదనపు ఇబ్బందులు, ట్యాక్స్‌లు ఎదురుకావు. ఈ విషయంపై అవగాహన లేకపోవడంతో పలువురు ఎక్కువ పన్ను చెల్లిస్తూనే ఉన్నారు. ఇకనైనా వాహనాన్ని అమ్మిన వెంటనే ఇరువైపులా యాజమాన్య హక్కులను స్పష్టంగా మార్చుకోవాలని ఆర్టీవో, ట్రాఫిక్ అధికారులు సూచిస్తున్నారు.

కొనుగోలుదారుడి పేరుపై రిజిస్ట్రేషన్ చేయించాలి



పాత వాహనాలు అమ్మిన వెంటనే కొనుగోలుదారుడిపై రిజిస్ట్రేషన్ చేయించాలి. లేదంటే కొనుగోలుదారుడు వాహనాన్ని అడ్డుపెట్టుకుని అక్రమ పనులు చేపడితే అమ్మిన వాహనదారుడిపైనే కేసులు నమోదవుతాయి. పాత వాహనాలు కొన్న వెంటనే ఫారం–29, 30 విక్రయించిన వారి సంతకాలు తీసుకుంటే యాజమాన్య హక్కుల బదిలీ సులభమవుతుంది. తప్పనిసరిగా ఇరువైపులా యాజమాన్యులు జాగ్రత్తలు పాటించాలి.

– సుధాకర్‌రెడ్డి, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్, ఆదోని

పత్రాలు లేకుండా కొనుగోలుచేయొద్దు



పాత వాహనాలు కొనుగోలు చేసేటప్పుడు సరైన పత్రాలు ఉన్నాయో లేదా సరి చూసుకోవాలి. నమ్మకంతో కొనుగోలు చేస్తే వాహనాలు సీజ్‌తో పాటు థెఫ్ట్ కేసులు నమోదవుతాయి. ట్రాఫిక్ చలానాలు, కేసులు లేని వాహనాలు మాత్రమే కొనుగోలు చేయాలి. చలానాల ద్వారా జేబుకు చిల్లు పడతాయి. జాగ్రత్తగా కొనుగోలు చేయాలి. కొనుగోలు చేసిన వెంటనే కొనుగోలుదారుడు వారం రోజుల్లోపు వాహనాన్ని రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

– మంజునాథ్, ట్రాఫిక్ సీఐ

సమావేశ మందిరం పునఃప్రారంభం



సమావేశ మందిరాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ సృజన

ఆదోని రూరల్: పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఆధునీకరించిన సమావేశ మందిరాన్ని శనివారం సాయంత్రం జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన పునఃప్రారంభించారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ, తహసీల్దార్ హసీనాసుల్తానా, డీఎస్పీ శివనారాయణస్వామి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య తదితరులు పాల్గొన్నారు.

25 వేల పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలి

ఎమ్మిగనూరుటౌన్: 25 వేల పోస్టులతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటించాలని డీవైఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అప్రెంటీస్ విధానాన్ని రద్దు చేయాలని, పదవీవిరమణ వయస్సు తగ్గించాలని, వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న 2.36 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరారు. సమావేశంలో డీవైఎఫ్‌ఐ నాయకులు రవి, అజిత్, హనుమంతు, వినోద్‌కుమార్, నాని, వినోద్, అఖిల్, మహేష్ పాల్గొన్నారు.

మానవుడి కర్తవ్య బోధయే గీతాసారం

- తిరుమల తిరుపతి దేవస్థానములు, ధర్మప్రచార పరిషత్ జిల్లా కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి





ధార్మిక కార్యక్రమాల ముగింపు కార్యక్రమంలో ప్రసంగిస్తున్న వక్తలు, పూజల్లో పాల్గొన్న ప్రజలు

ఆదోని అర్బన్: ప్రతి మానవుడు జీవితంలో ఎదురయ్యే పెనుసవాళ్లను ఎలా అధిగమించాలో తెలిపి, ధైర్యంగా ముందుకు సాగడానికి అవసరమైన శక్తిని భగవద్గీత మాత్రమే ఇస్తుందని, కష్టసుఖాలను సంయమనంతో ఎదుర్కొనే శక్తిని పెంచుతుందని తిరుమల తిరుపతి దేవస్థానములు, ధర్మప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి తెలిపారు. మండలంలోని విరుపాపురం గ్రామం ఆంజనేయస్వామి దేవస్థానంలో నాలుగు రోజులుగా జరుగుతున్న ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా గోపూజ, కుంకుమార్చన కార్యక్రమాల అనంతరం ధార్మిక సభా కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఛత్రపతి శివాజీ యువసేన అధ్యక్షులు బైలూరి యోగీశ్‌ప్రభు, అమ్మ ఒడి కుటీరం ఆశ్రమం నిర్వాహకురాలు మాతా అనంతానందగిరి, ఇస్కాన్ ధర్మ ప్రచారకులు నిత్యతృప్తదాస్, గ్రామ సర్పంచ్ ప్రహ్లాదయాదవ్, మాజీ సర్పంచ్ జి.హనుమంతప్ప, శ్రీవారి సేవకులు జి.సత్యనారాయణ, టీటీడీ ధర్మ ప్రచార మండలి సభ్యులు న్యాయకంటి భీమిరెడ్డి, సోమేశ్వరరెడ్డి, గ్రామ పురోహితులు జగదీష్‌శాస్త్రి, ఆనంద్, ఏకల్ అభియాన్ ఉపాధ్యక్షురాలు ఎస్.కె.అరుణ, వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షురాలు రాధారెడ్డి, నగర అధ్యక్షురాలు ఆర్.అరుణ తదితరులు పాల్గొన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

ఆదోని సెంట్రల్: అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ మురళీ మోహన్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ అయ్యప్ప సూచించారు. శనివారం కళాశాలలో ఆల్‌సెక్ టెక్నాలజీ ఆధ్వర్యంలో క్యాంపస్ సెలెక్షన్స్ నిర్వహించారు. వారు మాట్లాడుతూ జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే ప్రతి విద్యార్థి చదువుతో పాటు సాంకేతిక అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం నిర్వహించిన క్యాంపస్ సెలెక్షన్లలో 15 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ దైవాదీనం రెడ్డి, చైర్మన్ విట్టా సతీష్ అభినందించారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ అధికారి రామకృష్ణ, ఆల్‌సెక్ టెక్నాలజీ మానవవనరుల ప్రతినిధి బాబా ఫక్రుద్దీన్, జంతుశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ యుగంధర్, అధ్యాపకులు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అంజన్నకు ప్రత్యేక పూజలు

కౌతాళం: మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాలకు శనివారం భక్తులు అధికంగా తరలివచ్చి పూజలు నిర్వహించారు. కౌతాళంతో పాటు అగసల దిన్నె ఆంజనేయస్వామి, సుళేకేరి గ్రామ శివారులో వెలసిన బుడుములదొడ్డి ఆంజనేయస్వామి, ఎరిగేరి పులిగట్టు ఆంజనేయస్వామి ఆలయాల్లో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున అర్చకులు స్వామికి సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం చేపట్టారు.

ఏరువాకా సాగాలో...

రైతన్నల పండుగ ఏరువాక పౌర్ణమిని ఆదోని, మంత్రాలయం, ఎమ్మిగనూరు నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించుకున్నారు. వృషభాలను నీళ్లతో శుభ్రంగా కడిగి, అందంగా ముస్తాబు చేసి పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామాల శివారుల్లో నుంచి ఊరి వాకిళ్ల వద్ద వరకు పారువేట నిర్వహించారు. యువకులకు పరుగు పందెం, గుండు ఎత్తు తదితర పోటీలు నిర్వహించారు. విజేతలను ఊరేగించి సన్మానించారు.

ఘనంగా ఏరువాక పౌర్ణమి

- వాడవాడలా రైతన్నల పండుగ
- ఎడ్లకు పూజలు చేసి నైవేద్యం సమర్పించిన అన్నదాతలు



పెద్దతుంబళంలో పరుగుపందెం పోటీల్లో పరిగెడుతున్న వృషభాలు

ఆదోని రూరల్/అర్బన్: పట్టణంలోని ఎల్‌బీ స్ట్రీట్‌తో పాటు నాగలాపురం, మాంత్రికి, దొడ్డనకేరి, పెసలబండ, పెద్దతుంబళం, కుప్పగల్, పెద్దహరివాణం, సంతెకూడ్లూరు తదితర గ్రామాల్లో శనివారం ఏరువాక పౌర్ణమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పెద్దతుంబళం గ్రామంలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా గ్రామదేవతలకు నైవేద్యం సమర్పించారు. సాయంత్రం వృషభాల పారువేట నిర్వహించి గెలుపొందిన వృషభాల యజమానులకు ఎస్‌ఐ చిన్నపీరయ్య చేతులమీదుగా బహుమతులను అందించారు.

గోనెగండ్ల: మండల కేంద్రంతో పాటు గాజుల దిన్నె, కులుమాల, చిన్న నేలటూర్ తదితర గ్రామాల్లో ఏరువాక పౌర్ణమి వేడుకలను శనివారం వైభవంగా జరుపుకున్నారు. బసవన్నలను శుభ్రముగా కడిగి కొమ్ములకు వివిధ రంగులు పూసి వాటి మెడలో కొత్త గంటలు, రంగుల పూసలు, పూలతో నిండిన దిష్టితాళ్లతో అలంకరించి పూజించారు. గద్వాల గేరి, మొట్టివీధి, అచ్చుకట్ల గేరి, లక్ష్మిపేట, చాకలి వీధి, కురువ పేట ప్రాంతాల్లో ఎద్దుల పారువేట కార్యక్రమం చేపట్టారు. అలాగే గ్రామాల్లో ప్రధాన వీధుల్లో ఏర్పాటు చేసిన చావిడి తోరణాలకు తీసుకొని వెళ్లి పారువేట కార్యక్రమాన్ని నిర్వహించారు.



గద్వాల గేరిలో ఎద్దుల పారువేట, తిలకిస్తున్న ప్రజలు



జొహరాపురం రైతులు ఎద్దులకు నదిలో స్నానాలు చేయిస్తున్న దృశ్యం

నందవరం: మండలంలోని రైతులు ఏరువాక పౌర్ణమి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. రెక్కల కష్టం నేలపాలు కాకుండా, పుడమి తల్లి, ప్రకృతి సహకరించాలని అన్నదాతలు దేవతలకు మొక్కులు తీర్చుకున్నారు. మండల కేంద్రంతో పాటు గురజాల, నదికైరవాడి, ఇబ్రహీంపురం, జొహరాపురం, మాచాపురం, చిన్నకొత్తిలి, టి. సోమలగూడూరు, పొనకలదిన్నె తదితర గ్రామాల్లో ఉదయం ఎద్దులను ప్రత్యేక రంగులతో ముస్తాబు చేశారు. అనంతరం ఆయా గ్రామాల్లో వృషభాలను ఊరేగింపు నిర్వహించారు. జొహరాపురం రైతులు బసవన్నలకు నదీస్నానాలు చేయించి పూజించారు. ఇబ్రహీంపురం గ్రామంలో ఏరువాక పౌర్ణమి వేడుకల్లో భాగంగా వృషభాల పారువేట నిర్వహించారు.



కె.తిమ్మాపురం సమీపంలో పౌర్ణమి వేడుకలను జరుపుకుంటున్న ఏపీ రైతు సంఘం నాయకులు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని కె.తిమ్మాపురం గ్రామంలో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ఏరువాక పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్నగౌడ్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మునిప్పె, సీపీఐ మండల కార్యదర్శి చిన్నన్న, సర్పంచ్ బీజీ మహేశ్వరి మాట్లాడుతూ ఏరువాక పౌర్ణమి వేడుకులను ప్రవభుత్వమే అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, రైతు సంఘం నాయకుడు బీజీ విరూపాక్షినాయుడు తదితరులు పాల్గొన్నారు.

కోసిగి: ఏరువాక పౌర్ణిమను పురస్కరించుకుని మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో మారెమ్మ దేవి, సుంకులమ్మ దేవిలకు ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు కురిసి పుష్కలంగా పంటలు పండాలని వేడుకున్నారు. సాయంత్రం ఎద్దుల పార్వేటు నిర్వహించి, విజేత ఎద్దులను గ్రామాల్లో ఊరేరగించారు.



కోసిగిలో ఎద్దుల పారువేట నిర్వహిస్తున్న దృశ్యం

కౌతాళం: మండలంలోని కామవరం, ఓబుళాపురం తదితర గ్రామాల్లో ఏరువాక పౌర్ణమి వేడుకలను రెండో రోజు ఘనంగా నిర్వహించారు. ఎద్దుల పారువేట నిర్వహించారు. గ్రామ చావిడిలో ఏరంగు వృషభం ముందుగా చేరుకుంటుందో ఆ సంవత్సరం ఆ రంగు పంటలు బాగా పండుతాయని ఇక్కడి రైతుల నమ్మకం. యువకులకు పరుగుపందెం, ఇసుక బస్తాలు, గుండు ఎత్తు పందేలు నిర్వహించారు.



పరుగు పందెం విజేతను సన్మానిస్తున్న ఓబుళాపురం గ్రామస్తులు

నీటిని కాచి వడబోసుకుని తాగాలి

ఎమ్మిగనూరుటౌన్: ప్రస్తుతం సీజనల్ వ్యాధుల దృష్ట్యా నీటిని కాచి చల్లార్చుకుని వడబోసుకుని తాగాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బయటి ఆహార పదార్థాలను తినవద్దని సూచించారు. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, ఎక్కడైనా తాగునీరు కలుషితమవుతున్నట్లైతే పురపాలక సిబ్బందికి తెలిజేయాలని కోరారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

కోసిగి: మండల పరిధిలోని కొల్మాన్‌పేట గ్రామానికి చెందిన కిందిగేరి శ్రీనివాసులు పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. వ్యవసాయ పెట్టుబడులకు చేసిన అప్పులు తీర్చలేకపోవడంతోపాటు కుటుంబ కలహాలు కారణంగా మనస్తాపానికి గురై శనివారం ఇంట్లో పురుగు మందు తాగాడు. చుట్టుపక్కల వారు గమనించి అపస్మారక స్థితిలో పడి ఉన్న శ్రీనివాసులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆదోనికి తరలించారు.

సమితి నుంచి బహిష్కరించాలి

ఆదోని రూరల్: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్)లో అక్రమాలకు పాల్పడిన బండారి హనుమంతు, బండారి గిడ్డయ్య, మణికంఠలను బహిష్కరించాలని సమితి జిల్లా నాయకులు ఎస్.నాగప్ప మాదిగ, మాదాస్ జగన్ రాష్ట్ర, జిల్లా నాయకత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం వారు మాట్లాడుతూ జూలై 7న చలో వరంగల్, 30న మాదిగల కవాతుకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందాకృష్ణ మాదిగ ఆదేశించారన్నారు. మందాకృష్ణ మాదిగ ఆదేశాలను ధిక్కరిస్తూ నియోజకవర్గంలోని మాదిగలను మోసం చేసిన బండారి హనుమంతు, బండారి గిడ్డయ్య, పన్నెల మణికంఠ వారి స్వార్థ, స్వలాభాల కోసం మాదిగ జాతిని తాకట్టు పెట్టి రూ.2.50 లక్షలు డబ్బు తీసుకున్నారని ఆరోపించారు. లెక్కలు అడిగినందుకు తమపైన నిందలు వేస్తూ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. వీరి ముగ్గురిని ఎమ్మార్పీస్ నుంచి బహిష్కరించాలని జిల్లా, రాష్ట్ర, జాతీయ నాయకత్వాన్ని కోరుతున్నామన్నారు. సమావేశంలో నాయకులు పీఎస్ వీరేష్ మాదిగ, ఉసేనప్ప మాదిగ, గుమ్మల బాలస్వామి, బైచిగేరి తిమ్మన్న మాదిగ తదితరులు పాల్గొన్నారు.

26న వేలం పాటలు

కౌతాళం: పంచాయతీకి సంబంధించిన వేలం పాటలను ఈనెల 26న నిర్వహించనున్నట్లు సర్పంచ్ పాల్ దినకర్, పంచాయతీ కార్యదర్శి శివప్ప తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ బండి మెట్ట, కమేళా, దినసరి మార్కెట్‌కు సంబంధించిన వేలం పాటలు ఉంటాయని, ఆసక్తి ఉన్న వారు వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

డయేరియా ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న వైద్యాధికారిణి జాహ్నవి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో డయేరియా ప్రబలకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు వ్యాధి లక్షణాలున్న వారికి చికిత్సలందించే చర్యలు చేపట్టాలని స్థానిక వైద్యాధికారిణి జాహ్నవి సూచించారు. శనివారం స్థానిక మున్సిపల్ సమావేశ భవనంలో డయేరియాపై వార్డు హెల్త్ సెక్రటరీలు, అమెనిటీ సెక్రటరీలు, శానిటేషన్, ఎన్విరాన్మెంటల్ సెక్రటరీలు, ఆశా వర్కర్లకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత, కుళాయి ద్వారా వచ్చే తాగునీటిని కాచి వడబోసి తాగేవిధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డయేరియా రాకుండా ముందుజాగ్రత్త చర్యలు, లక్షణాలున్న వారిని గుర్తించడం, వారికి చికిత్సలు అందించడంపై వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈలు మనోహర్‌రెడ్డి, నీరజ, మేనేజర్ వరప్రసాద్, ఏఈ శరత్‌చంద్ర పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తికి గాయాలు

ఆదోని అర్బన్: మండలంలోని కుప్పగల్ గ్రామానికి చెందిన వెంకటేష్ విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు. శనివారం ఉదయం వెంకటేష్ పొలానికి వెళ్లి వ్యవసాయ బోరు స్విచ్ ఆన్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. కుటుంబ సభ్యులు ఆదోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం డాక్టర్లు కర్నూలుకు రెఫర్ చేసినట్లు వెంకటేష్ భార్య రంగమ్మ తెలిపారు.

ఆటో స్టాండ్‌ను ఏర్పాటు చేయండి

కౌతాళం: ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయం వద్ద ప్రత్యేక ఆటో స్టాండ్‌ను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈరన్న, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య శనివారం ఆలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు. అంతకుముందు స్థానిక బస్టాండ్ వద్ద ఆటో యూనియన్ నాయకులతో వారు సమావేశమై ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా, దేవస్థానానికి వచ్చే భక్తులకు సహకరించి ఆటోలు నడుపుకోవాలని ఆటో డ్రైవర్లకు సూచించారు. సమావేశంలో ఆటో యూనియన్ మండల అధ్యక్షుడు వీరారెడ్డి, నాయకులు బీరప్ప, నరసింహులు, ఈరప్ప, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.